క్లుప్తంగా

ముగిసిన కాల భైరవ అఖండ హోమం



కాల భైరవ అఖండ హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్‌లోని శ్రీ ఆదిశేష నిలయంలో కాల భైరావష్టమి సందర్భంగా 170 గంటల పాటు నిర్విరామంగా సాగిన కాల భైరవ అఖండ హోమం మహా పూర్ణాహుతితో మంగళవారం అర్ధరాత్రి ముగిసింది. వేలాది కొబ్బరి కాయలు, వందలాది గుమ్మడి కాయలు, అనేక హోమ ద్రవ్యాలతో లక్ష మంత్రాహుతులు సమర్పించారు. హోమ కర్తలుగా రవణం నరేంద్రకుమార్, నాగ కృష్ణ వేణి దంపతులు వ్యవహరించారు.అక్షయ పాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి మెట్లకు నివాళి

అమలాపురం టౌన్: మాజీ మంత్రి డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు వర్ధంతిని టీడీపీ నాయకులు అమలాపురంలో బుధవారం నిర్వహించారు. స్థానిక నల్లవంతెన వద్ద గల డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు విగ్రహానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు స్థానిక కిమ్స్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి చెంతన నిర్మించిన సత్యనారాయణరావు ఘాట్ వద్దకు పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. కొత్తపేట, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, దాట్ల బుచ్చిబాబు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డాక్టర్ మెట్ల తనయుడు మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ పాల్గొన్నారు.
అల్లవరం: మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ వర్ధంతిని కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకార సంఘం కార్యాలయ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మెట్ల విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు గునిశెట్టి రోహిణీ కుమార్, డైరెక్టర్లు గుర్రం బాబు, ఉప సర్పంచ్ గుర్రం శ్రీను తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఈఓ కొమ్మూరి సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ

యానాం: కాకినాడలో జరిగిన 3వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక యానాం వేద పాఠశాల చిన్నారులు ప్రతిభ కనబరిచారు. బుధవారం చైర్మెన్ గుత్తుల జయరామారావు, డైరెక్టర్లు నీతూ, అర్జున్‌లు వివరాలు వెల్లడించారు. విద్యార్థులు జయశ్రీ,, జశ్వీర్, నిఖిలేష్‌లు పతకాలు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అవిశ్వాసానికి మరో ఎమ్మెల్యే నోటీసు

యానాం: పుదుచ్చేరి స్పీకర్ ఆర్ సెల్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటూ ఇప్పటికే బీజేపీకి మద్దతుగా ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు పంపారు. బుధవారం బీజేపీకి మద్దతిస్తున్న ఉజవకరై నియోజకవర్గ ఎమ్మెల్యే శివశంకర్ సైతం నోటీసు అందజేశారు. రాజ్యాంగ నిబంధనలను స్పీకర్ సెల్వం ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, అంచనాల కమిటీలో సైతం ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

మను ధర్మ ప్రతుల దహనం

అమలాపురం టౌన్: కుల వ్యవస్థకు, మూఢ నమ్మకాలకు కారణమైన మను ధర్మ శాస్త్ర ప్రతులను స్థానిక గడియారం స్తంభం సెంటరులో పలు దళిత ప్రజా సంఘాల నాయకులు బుధవారం సాయంత్రం దహనం చేశారు. పార్లమెంట్‌లో మను ధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేసిన రోజును పురస్కరించుకొని దళిత నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరపతిరావు, మాల మహానాడు నాయకుడు పెయ్యల శ్రీనివాసరావు, పలు దళిత సంఘాల నాయకులు ములపర్తి సత్యనారాయణ, నాతి శ్రీనివాసరావు, నాగబత్తుల నరసింహమూర్తి, కాశి వెంకట్రావు, న్యాయవాది కటికదల సత్యనారాయణ, కాశి రాంబోది తదితరులు పాల్గొన్నారు.
తాళ్లరేవు: జన చైతన్య మండలి, ఎండీయూడబ్ల్యూఏ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. తొలుత స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద జన చైతన్య మండలి కాకినాడ జిల్లా కన్వీనర్ కాశి రామారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. అనంతరం చెరువుగట్టు సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. .

రైతాంగం ఆర్థికాభివృద్ధికి కృషి

యానాం: రైతాంగం ఆర్థికాభివృద్ధికి నూతనంగా ఏర్పాటు చేసిన బ్లాక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కోపరేటివ్ సొసైటీ కార్యవర్గం కృషి చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని దేశంలో కొత్తగా నమోదైన 10 వేల సహకార డెయిరీ, ఫిషరీస్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల మెగా ఈవెంట్‌ను ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. దీనిలో భాగంగా యానాం లో ఏర్పాటు చేసిన ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ కోపరేటివ్ సొసైటీ కార్యవర్గం ప్రారంభించబడింది. అనంతరం ఏరువాక సంస్థ నుంచి ఉత్తమ రైతుగా ఎన్నికైన మాజేటి సత్యభాస్కర్‌ను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, కోన వెంకటరావు, అధికారులు అబ్దుల్‌రజాక్, ఎమ్ శంకర్ పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆపన్నహస్తం

- రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం సేవలు స్ఫూర్తిదాయకం
- ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు శిక్షణ
- ఉచితంగా ఫిజియోథెరపీ వైద్యం
- వివిధ ప్రాంతాల నుంచి చికిత్సకు వస్తున్న రోగులు
- పదిహేనేళ్లుగా నిరంతరాయ సేవలు



కోరంగి పంచాయతీ సీతారామపురంలో నెలకొల్పిన రిలయన్స్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్



బుద్ధిమాంద్యం గల దివ్యాంగులకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు శ్రీకాంత్

తాళ్లరేవు: పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, మూగ, చెవుడు వంటి వైకల్యాలతో పుట్టిన చిన్నారులకు కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్(దివ్యాంగుల కేంద్రం) వరంగా మారింది. రిలయన్స్, ఉమా మనో వికాసం కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సెంటర్ ద్వారా అనేక మంది దివ్యాంగులు ఉచిత సేవలు పొందుతున్నారు. బుద్ధిమాంద్యం గల పిల్లలను అక్కున చేర్చుకుని వారికి ఖరీదైన ఫిజియోథెరపీ వైద్యాన్ని ఉచితంగా అందించడం వంటి సేవలతో ప్రజల మన్ననలు చూరగొంటోంది. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఈ కేంద్రానికి వచ్చి సేవలతో స్వాంతన పొందుతున్నారు. రిలయన్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరూబాయి అంబాని జయంతి సందర్భంగా డిశంబరు 28, 2009లో ఈ సంస్థను ప్రారంభించి 15 ఏళ్లుగా నిరాటంకంగా సేవలందిస్తున్నారు. ఏటా డిశంబరు 28వ తేదీన ధీరూబాయి అంబానీ పుట్టినరోజు వేడుకలతో పాటు సంస్థ వార్షికోత్సవాన్ని పండగలా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి రిలయన్స్, ఉమా మనోవికాసం కేంద్రం ప్రతినిధులు హాజరై సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తారు.

భవిష్యత్తుకు భరోసా

బుద్ధిమాంద్యం గల దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తుంటారు. స్పెషల్ ఎడ్యుకేటర్లు వారిలో మార్పును తీసుకురావడంతో పాటు వారికి ప్రత్యేకమైన విద్యనందించి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఎదుటివారితో మసలుకునే విధానంపై శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యలో సైతం రాణించేలా చేస్తారు. టెన్త్, ఇంటర్ పరీక్షలను సైతం రాయించి వారికి బతుకుపై భరోసా కల్పిస్తున్నారు.

ఖరీదైన వైద్యం ఉచితమే

ఇటీవల కాలంలో అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధ పడడం చూస్తున్నాం. వీటికి ప్రధానంగా మందులతో పాటు ఫిజియోథెరపీ చేస్తేనే శాశ్వతంగా నయమవుతుందని వైద్యులు చెపుతుంటారు. అయితే ప్రముఖ నగరాలలో మాత్రమే ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉండడం, ఆ వైద్యం సైతం ఖరీదవడంతో చాలామంది వైద్యం చేయించుకోలేక బాధ పడుతుంటారు. దీనిని గుర్తించిన సంస్థ ప్రతినిధులు ఈ కేంద్రంలో ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించడం ప్రారంభించారు. వివిధ రకాలైన నొప్పులతో బాధ పడుతూ ఈ కేంద్రానికి వచ్చేవారిని తిరిగి మామూలు వ్యక్తులుగా మార్చి పంపిస్తుంటారు. ధనిక, పేద తేడా లేకుండా వైద్యం కోసం వచ్చిన వారందరికీ సేవలందించడం ఈ కేంద్రం ప్రత్యేకత. దీంతో ఈ కేంద్రం ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాక ఐ.పోలవరం, రామచంద్రపురం, కాజులూరు, కరప, కాకినాడ ప్రాంతాల నుంచి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. అలాగే మ్యూజిక్ అండ్ యోగా థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ తదితర సేవలను అందిస్తున్నారు.

సేవలను విస్తరిస్తాం



రిలయన్స్ వ్యవస్థాపకులు ధీరూబాయి అంబానీ పేరిట కేంద్రాన్ని నిర్వహిస్తూ అనేక సేవలను ప్రజలకు అందిస్తున్నాం. ముఖ్యంగా బుద్ధిమాంద్యం గల దివ్యాంగులకు అందించే సేవలు ఎనలేనివి. సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ సేవలందిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. దీనిలో భాగంగా భవనంపై మరో అంతస్తు వేసి మరింత మందికి సేవలందించేందుకు సిద్ధం చేస్తున్నాం. బుద్ధిమాంద్యం గల దివ్యాంగులు ఎవరైనా ఉంటే పాఠశాలలో సంప్రదించాలి.

సుబ్రహ్మణ్యం, రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం ప్రతినిధి.

సిబ్బంది సేవలు ప్రశంసనీయం



తాళ్లరేవు పరిసర ప్రాంతాలలో బుద్ధిమాంద్యం కలిగిన దివ్యాంగులు ఎక్కువగా ఉండడాన్ని గుర్తించి 2009లో ఈ కేంద్రాన్ని ప్రారంభించాం. ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించటంతో పాటు రిలయన్స్ సంస్థ వారిని సంప్రదించిన తర్వాతనే ఈ పాఠశాలను ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి నిరాటంకంగా ఉచిత సేవలను అందిస్తున్నాం. అవసరాలకు తగ్గట్టుగా సంస్థను విస్తరించి మరిన్ని సేవలు అందే విధంగా చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది సేవలు ప్రశంసనీయం.

ఎస్పీ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఉమా మనో వికాస కేంద్రం.

ఉచిత సేవలు



మేనరిక వివాహాలు, పౌష్టికాహార లోపం తదితర కారణాలతో పిల్లలు పుట్టుకతోనే బుద్ధిమాంద్యంతో పుడుతున్నారు. మా కేంద్రంలో అటువంటివారు 66 మంది వరకు ఉన్నారు. వీరికి 11 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ఇంటివద్ద నుంచి పిల్లల్ని తీసుకువెళ్లడం దగ్గర నుంచి వారికి చదువు చెప్పడం, రోజంతా ఆట పాటలతో విద్య నేర్పించడం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ఎంపీ గోపాల్, రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం ఇన్‌చార్జి.

పాలనాదక్షుడు వాజ్‌పేయి



అమలాపురంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కొత్తలంకలో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో నాయకులు

ముమ్మిడివరం: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను బుధవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. కొత్తలంక బీజేపీ నాయకులు కొడమర్తి రామభాస్కర వెంకటరత్న శర్మ స్వగృహంలో వాజ్‌పేయి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముమ్మిడివరం టౌన్ బీజేపీ ఆధ్వర్యంలో విష్ణాలయం సెంటర్‌లో శతజయంతి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొలకోటి వెంకటరెడ్డి, మూర్తిరాజు, రామసత్తిబాబు, బీజేపీ నాయకులు అల్లూరి సత్యనారాయణరాజు, కొయ్యల దుర్గారావు, శ్రీహరి పాల్గొన్నారు.
అమలాపురం రూరల్: ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రోగ్రాం కన్వీనర్ చెరుకూరి గోపాలకృష్ణ, సీనియర్ నాయకులు ఆర్‌వీ నాయుడు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



ఎస్.కొత్తపల్లిలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు



వన్నెచింతలపూడిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అబేంద్కర్ ఆదర్శ సేవాసంఘం సభ్యులు

ఉప్పలగుప్తం: పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో మాల మహానాడు మండలాధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గోసంగి శ్రీనివాసరావు, నేరేడుమెల్లి రాజు, కొల్లి నరేంద్ర, భీమవరపు విజయ్‌కుమార్, ఏసు, గోసంగి సన్ని, నేరేడుమెల్లి రాజేశ్వరరావు, చింతా సత్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.
అమలాపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వన్నె చింతలపూడిలోని అంబేడ్కర్ ఆదర్శ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులు అర్పించారు. అనంతరం వన్నె చింతలపూడి నుంచి సమనస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరమట మోహన కుమార్, దళిత నాయకులు నక్కా కృష్ణ, పరమట వెంకటేశ్వరరావు, కందేరి వెంకటరమణ, పరమట భీమా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి వాహనాలు అక్కడే..!

ఈదరపల్లి వంతెనపై నిలిచిపోయిన ట్రాఫిక్



అమలాపురం ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ మార్గంలో నిలిచిపోయిన ట్రాఫిక్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకొని విలవిల్లాడుతోంది. ముఖ్యంగా ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు రోజులో ఒక్కసారైనా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. పెళ్లిళ్ల సీజన్ అయితే ఇక్కడ ట్రాఫిక్ సమస్య మరీ జటిలంగా మారుతుంది. ఈదరపల్లి వంతెన నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ రోడ్డులో బుధవారం అరగంట సయయం పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాలు రోడ్డుపై బారులు తీరడంతో ట్రాఫిక్ ఎప్పుడు వీడుతుందా..అని వాహన చోదకులు ఎదురు చూడడం కనిపించింది. ఇందుపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో పెళ్లిళ్ల జరిగే సమయంలో ఈదరపల్లి వంతెనపై ట్రాఫిక్ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. సాయంత్రం అయిదు గంటలైతే చాలు పట్టణంలో విద్యా సంస్థల బస్సులు ఒక్కసారే రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ భారం పట్టణంపై మరింత పడుతోంది. రాత్రి అయిందంటే హైదరాబాద్ వెళ్లే పలు ట్రావెల్స్ సంస్థల హైటెక్ బస్సులను రోడ్లపైనే నిలిపేసి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ట్రాఫిక్ సమస్యకు మరింత ఆజ్యం పోస్తోంది. అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి 7 వంతెనలు నిర్మించనున్నట్లు ప్రకటిస్తున్నారే తప్ప కార్యరూపం దాల్చడంలేదు. 7 వంతెనల మాట అటుంచి ఈదరపల్లి, నల్లవంతెన, ఎర్రవంతెనల వద్ద ప్రత్యామ్నాయంగా కొత్త వంతెనలు నిర్మిస్తే సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుందని పట్టణ ప్రజలు అంటున్నారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఎంత శ్రమిస్తున్నా పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కత్తి మీద సామే అవుతోంది.

రక్షిత నీటి నిర్వహణలో నిర్లక్ష్యం



ట్యాంక్ నిండి రోడ్డుపైకి వస్తున్న తాగునీరు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని నల్లగుంట ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నుంచి ప్రజలకు చేరాల్సిన తాగునీరు వృథాగా పోతోంది. గుండెపూడిలోని ప్రధాన ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నుంచి ఈ ట్యాంక్‌కు శుద్ధి చేసిన నీటిని నింపుతారు. నీటిని నింపే క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యంతో ట్యాంక్ నిండిపోయి నీరు నేలపాలవుతోంది. ఇలా ఏదో ఒకసారి జరిగిందిలే అనుకుంటే పొరపాటే. నెలలో నాలుగైదు సార్లు నీరు వృథాగా పోవడం పరిపాటిగా మారింది. ట్యాంక్ నిండిపోయి నీరు రోడ్డుపైకి రావడం తరుచుగా జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోరని స్థానికులు వాపోయారు. దేవగుప్తం బీసీ ఏరియా, డి.రావులపాలెం గ్రామాల్లో ప్రజలకు సరిగా తాగునీరు పంపిణీ కావడం లేదు. రెండు రోజులకు ఒకసారి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీటిని వృథా చేసే బదులు ప్రజలకు పూర్తి స్థాయిలో సరఫరా చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్రీస్తు నామం.. పాప హరణం

- భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవ సోదరులు
- కిటకిటలాడిన ప్రధాన చర్చిలు



తాళ్లరేవు చర్చిలో క్రిస్మస్ సందేశాన్నిస్తున్న దొమ్మేటి శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని పలు ప్రధాన చర్చిలలో వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి చర్చిలన్నీ భక్తులతో కళకళలాడాయి. అర్ధరాత్రి నుంచి బాలఏసుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాళ్లరేవులోని బాప్టిస్టు చర్చిలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, సహనం, త్యాగం, శాంతియుత జీవన విధానాన్ని జీసస్ తన జీవితం ద్వారా తెలియజేశారన్నారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కోరంగి, సీతారామపురం, నీలపల్లి, ఇంజరం, గోవలంక, పి.మల్లవరం, పటవల, చొల్లంగి, చొల్లంగిపేట తదితర చర్చిలతో పాటు వివిధ గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ విందును ఆరగించారు.
అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన వద్ద గల మన్నా సిల్వర్ చర్చిలో కిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన ప్రత్యేక పార్థనల్లో క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. క్రీస్తు గీతాలతో పాటు క్రీస్తు చరిత్రను ప్రతిబింబిస్తూ ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. సినిమా సెట్టింగులను మైమరపించేలా ఈ ప్రదర్శనలు నిర్వహించారు. చర్చి ప్రధాన కాపరి, జిల్లా పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ అధ్యక్షుడు కార్ల్ డేవిడ్ కొమానపల్లి (లాల్) క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. సంఘ కాపర్లు ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరు తాతపూడి క్రీస్తు సందేశాలను ఇచ్చారు.
ఐ.పోలవరం: క్రిస్మస్ వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. పేదలకు వస్త్రాల పంపిణీ, అన్న సమారాధన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. మంగళవారం రాత్రి క్రిస్మస్ ఈవ్ పేరిట ప్రత్యేక ప్రార్థనలతో గడిపారు. మండలంలోని కొమరగిరి, టి.కొత్తపల్లి, కేశనకుర్రు తదితర గ్రామాల్లోని చర్చిల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. విద్యుత్ కాంతులతో చర్చిలకు కొత్తరూపు సంతరించుకుంది.
ముమ్మిడివరం: క్రిస్మస్ పండగను క్రైస్తవ సోదరులు బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నియోజకవర్గంలోని పలు చర్చిలలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. పేదలకు దాన ధర్మాలు చేశారు. మంగళవారం రాత్రి నుంచే చర్చిలలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ముమ్మిడివరంలోని సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవ.ఎన్. సునీల్, పెంతుకోస్తు ప్రార్థనా మందిరంలో రెవ.సామ్యూల్, వరల్డ్ పీస్ ఈవేంజికల్ చర్చిలో పాస్టర్ ప్రభుదానం, కత్రివేల్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ క్రిష్టోపర్, ఇంజియాన్ పెంతుకోస్తు చర్చిలో పాస్టర్ జ్యోతిబాబు, రమా బ్లెసింగ్ చర్చిలో ఫిలిప్స్, జీడీఎం చర్చిలో పాస్టర్ విలియమ్స్, మున్నాచర్చిలో పాస్టర్ జయధనంలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
యానాం: నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెట్టకూరులోని మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు పాస్టర్ రెవరెండ్ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, రెవెరెండ్ బిషప్ వసంతరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ప్రఖ్యాత ఫ్రెంచి కాలంనాటి రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆర్ఏఓ మునిస్వామి ప్రత్యేక అతిథిగా హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కురసాంపేట, పరంపేట, దరియాల తిప్ప ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నాయకుడు తోటరాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు.
ఉప్పలగుప్తం: మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వానపల్లిపాలెంలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు ఎం.దైవదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభ్యులకు చీరలు పంపిణీ చేశారు. ఉప్పలగుప్తంలోని మన్నా చర్చిలో పాస్టర్ చిక్కం ఫాతిమాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సలాది ఊర్మిళాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పాస్టర్ చిక్కం దానియేలు, కడిమి బేబిగ్రేస్, సలాది సతీష్ పాల్గొన్నారు.
అమలాపురం రూరల్: అమలాపురం విత్తనాలవారిపాలెంలోని ఏసుబాబు విగ్రహం వద్ద క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు చింతా వెంకటేశ్వరరావు, కొల్లాటి పట్టాభి అధ్వర్యంలో 50 మంది వృద్ధులు, వితంతువులకు భోజనం ఏర్పాటు చేశారు. చీరలు పంపిణీ చేశారు. తొలుత ఏసు బాబు విగ్రహం వద్ద క్రీస్తు ప్రార్థనలు నిర్వహించారు.



అమలాపురంలో పిల్లలకు స్వీట్లు పంచిపెడుతున్న క్రిస్మస్ తాత



ముమ్మిడివరం సెయింట్‌పాల్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు



మెట్టకూరు బాప్టిస్టు చర్చిలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు



యానాం ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రిస్మస్ సందర్భంగా వానపల్లిపాలెంలో మహిళలకు చీరల పంపిణీ